# రంగులకల

'మధుమతి దగ్గర నుండి లెటర్ వచ్చింది.' అమ్మ చెప్పినవార్త వినగానే అప్పుడే కాలేజీనుండి యింటికి వచ్చిన రేఖ ఆనందంతో కెవ్వున కేక వేసినంత పని చేసింది.

'ఏది? లెటరెక్కడ పెట్టేవు?' అంటూ ఆత్రంగా అడిగింది.

'ఏమిటే ఆ హడావిడి? నువ్వు చదువుకునే టేబులు మీద ఉంది. పోయి చూడు, జాగ్రత్త! ఏమిటాపరుగు క్రిందపడి మోకాళ్ళు విరగొట్టుకునేవు...' అమ్మ హెచ్చరికలను వినకుండానే పరుగు పరుగున తన గదిలోకి వెళ్ళింది రేఖ.

చేతిలోని పుస్తకాల బ్యాగును మంచంమీదకుగిరాటు వేసింది. టేబులమీద పేపర్ వైట్ క్రింద ముచ్చటగా, కుదురుగా ఉన్న నీలిరంగు కవరును చూస్తూనే ఆమె కళ్ళు ఆనం

దంతో మిలమిల మెరిసినయ్ ఆమె గుండె వేగంగా కొట్టు కుంది.

'మధుమతి! మధుమతి!' అంటూ ఆమె గుండె మధు రంగా పలుకుతోంది.

అబ్బ! ఎన్నాళ్ళయింది మధుమతి ఉత్తరం నెలరోజులు ఈ నెల రోజులలోను తను నాలుగు ఉత్తరాలన్నా వ్రాసింది మధుమతికి, ఉత్తరాల సారాంశమంతా ఒకటే! "మీ కలం నుండి వెలవడే ఉత్తరంకోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. నా ఆశను నిరాశ కానీయరని ఆశిస్తున్నాను.

పాపం మధుమతికి ఎన్ని పనులు! ఎంతహడావిడి! తన లాటి పాఠకులు ఆమెకి ఎన్ని వందలమంది ఉన్నారో! ఐనా తీరిక చేసుకుని నెలకు ఒకటో రెండో ఉత్తరాలు వ్రాస్తూనే ఉంటుంది తనికి. బహుశా తన 'పోరు' పడలేక ముడుపు చెల్లించుకునేట్టు వ్రాస్తుందేమో తనకి. ఎలాగైనా వ్రాయనీ తనకు కావలసింది ఆమె స్వదస్తూరితో వ్రాసిన ఉత్తరం వ్రాయటానికి ఆమె ఎంతైనా విసుక్కోనీ. ఆకరికి తిట్టుకున్నా సరే తనేం కించపడదు. తనకి కావలసిందల్లా ఆమె ఉత్తరం! అందులో ముఖ్యావసరాల్లో ఉన్న ఆమె వాక్యాలు; వాటిలో నుండి తొంగిచూసే అత్యద్భుతమైన మేధస్సు.

అసలు మధుమతి వంటి సుప్రసిద్ధ రచయిత్రి రచనలు చదివి వాటిని పూర్తిగా అర్థం చేసుకోవటమే ఒక గొప్ప

విషయం. కేవలం అర్థం చేసుకుని ఊరుకోవటం కాక తను ఆమె రచనల ద్వారా ఏమి గ్రహించిందో దానిని అందంగా, వివరంగా విమర్శనాత్మకంగా ఆ రచయిత్రికే విప్పి చెప్పగల గటం మరో గొప్ప విషయం. తన అభిప్రాయాలను చదివి, ఆమెమీద తనకుగల శ్రద్ధాశక్తులను గుర్తించి తనకి ఆద రంగా ఆమె ఉత్తరం వ్రాయటమే మహావరంగా భావిస్తుంది. రేఖ.

రేఖ బియ్యే, ఫైనలియర్ చదువుతోంది. లిటరేచర్ మైన్‌తో బియ్యే చదువుతున్న రేఖ తెలుగులో వెలువడే మాస పత్రికలన్నిటినీ అక్షరం వదలకుండా చదువు తుంది. అచ్చయిన ప్రతి రచననూ చదివినప్పటికి ఆమెకు నచ్చే రచనలు మాత్రం చాలా కొద్దిమాత్రమే. ఆ కొద్ది రచనలతో మధుమతి రచనలు ముఖ్యమైనవి.

మధుమతి చేతిలో ఎలాటి యితివృత్తమైనా సరే అద్భుతంగా రూపులు దిద్దుకుంటుంది. ఎంతటి అతిసామాన్య మైన విషయాన్నైనా అందంగా, అందరిచేత చదివించి, మెప్పించే విధంగా వ్రాయటంతో ఆమె కామే సాటి. నిత్య జీవితంలో ఎదురయ్యే ప్రతి చిన్న సంఘటననూ ఎంతో నిశి తంగా పరిశీలించి దానిని గురించి యితరులు ఎవ్వరూ ఊహిం చని పద్ధతిలో హృదయానికి హత్తుకుపోయేలా వ్రాసే మధు మతి అంటే రేఖకు ఎంతో అభిమానం, గౌరవం.

ఆమె రచనలను చదువుతున్నకొలదీ క్రమంగా ఆమె రచనలకన్నా ఆమెరచనలలో వ్యక్తమయ్యే వ్యక్తిత్వమే రేఖ ఎక్కువగా ఆకర్షించసాగింది. ఇంత అందంగా వ్రాసే ఆ రచయిత్రి ఎంత అందంగా ఉంటుందో! ఇన్ని గొప్పవిషయాలను గురించి వ్రాసే ఆమె హృదయం ఎంత గొప్పదో! లక్షలాది పాఠకులను ఆకర్షించే రచనలను చేస్తున్న ఆమె వ్యక్తిత్వం ఎంత విశిష్టమైనదో! ఇలా ఆలోచించుకుపోతున్న రేఖకు మధుమతి మీద ఎంతో గౌరవం ఏర్పడసాగింది. ఆమెతో ఎలాగైనా పరిచయం చేసుకోవాలన్న కోరిక కలిగింది.

మధుమతి వ్రాసిన సీరియల్ నవల అచ్చవుతున్న పత్రికకు వ్రాసి ఆమె అడ్రసు తెలుసుకుంది. మధుమతి విశాఖపట్టణంలో ఉంటుందన్న విషయం తెలిసేక రేఖకు కొంచెం నిరుత్సాహం కలిగింది. ఎక్కడి హైద్రాబాద్, ఎక్కడ విశాఖ! కనీసం తనకు తెలిసిన బంధువులన్నా లేరు. విశాఖలో ఒకసారి ఆ ఊరు వెళ్ళి అలాగే మధుమతిని చూద్దామంటే!

ఆమె మీద ఎంత అభిమానం ఉంటే మాత్రం నిండా పద్దెనిమిదేళ్ళులేని తను ఒంటరిగా విశాఖ వెళ్ళి ఎక్కడని ఉంటుంది? మధుమతి యింటికే సరాసరి వెళ్ళి తిష్టవేస్తే ఏం బాగుంటుంది?

మధుమతిని కళ్లారా చూసి తరించే భాగ్యం పాలుబడలేదు. కనుక కనీసం ఉత్తరాల ద్వారానైనా పరిచయం చేసుకుందామని భావించి మధుమతి యిటీవల వ్రాసిన నవలను

మెచ్చుకుంటూ పది పేజీల ఉత్తరం వ్రాసి పోస్టులో వేసిన దగ్గరనుండి జవాబు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడసాగింది. ఆ నిరీక్షణలో పదిహేనురోజులకన్నా ఎక్కువ చెయ్యకముందే మరో ఉత్తరం వ్రాసింది. రెండవ ఉత్తరానికి వారం రోజులకన్నా ఎక్కువ ఓపికవ్వలేకపోయింది రేఖ అందువల్ల వెంటనే మరో ఉత్తరం వ్రాసింది. ఆమె మూడవ ఉత్తరాన్ని పోస్టుచేసిన వారం రోజులకల్లా మధుమతినుండి జవాబు వచ్చింది.

మధుమతి వ్రాసింది కేవలం ఇన్‌లాండ్ కవరు మాత్రమే! అందులో ఉన్నవి కూడా ఏడెనిమిది వాక్యాలు కాని అదే మహాభాగ్యంగా భావించి మురిసిపోయింది రేఖ ఆమె వ్రాసిన మూడు ఉత్తరాలూ అందినవి తీరిక లేక జవాబు వెంటనే యివ్వలేక పోయేననీ, నవలను గురించి ఆమె అభిప్రాయాలు చదివి సంతోషించేననీ, ఆమె వంటి పాఠకుల ఆదరాభిమానాలను చూసి నప్పుడల్లా కనీసం వారికోసమైనా మరి కొన్ని మంచి రచనలు చెయ్యాలన్న కోరిక తనకు కలుగుతుందని వ్రాసింది మధుమతి.

ఆ ఉత్తరాన్ని కనీసం వందసార్లన్నా చదువుకుంది రేఖ. వెంటనే ఆమెకు జవాబు కూడా వ్రాసింది. తరువాత మధుమతి వ్రాసిన ఉత్తరాన్ని తన స్నేహితురాళ్ళందరికీ చూపించింది. కొందరితో 'మధుమతి నా ఫ్రెండు' అని కూడా చెప్పింది.

అలా ప్రారంభమయిన వారి ఉత్తరాల పరిచయం నెల నెలకీ అభివృద్ధి అవసాగింది. ఏడాది తిరిగివచ్చేసరికి రేఖ మధుమతికి దాదాపు ఏభై ఉత్తరాలు వ్రాయటం వాటికి ఆమెనుండి ఏడెనిమిదిసార్లు జవాబులు రావటం జరిగింది.

ఇటీవల వరుసగా తాను వ్రాసిన నాలుగు ఉత్తరాలకు జవాబు యింతవరకు రానేలేదని చింతిస్తున్న రేఖకు ఆ సాయంత్రం 'మధుమతి దగ్గరనుండి లెటర్ వచ్చింది' అని అమ్మ చెప్పేసరికి అందుకే అంత సంతోషం కలిగింది.

రేఖ గబ గబ ఉత్తరం చించి చదివింది. చాలా చిన్న ఉత్తరం అది.

'డియర్ రేఖా !

నీ కొక సంతోషకరమైన వార్తను తెలియబరుస్తున్నాను. మా వారికి హైదాబాద్‌కు ట్రాన్సుఫరయింది. వచ్చే యిరవయ్యో తారీకుకల్లా ఆయన అఫీసులో జాయినవాలి. అందుకే యిల్లు వెతకమని ఒక ఫ్రెండుకు వ్రాసేరు, మేము పంధొమ్మిదవ తారీకుకల్లా హైదాబాద్‌లో ఉంటాము. అక్కడకు వచ్చేక మా అడ్రసు తెలుపుతాను.

ఇట్లు,

మ ధు మ తి.

ఆ ఉత్తరం చూసేక రేఖ ఆనందానికి పట్టపగ్గాలు లేవు. 'అమ్మా! అమ్మా! మధుమతి వచ్చేస్తోందే! మధుమతి వచ్చేస్తోందే' అంటూ యిల్లంతా గంతులు వేసింది.

'మధుమతి వచ్చేయటమేమిటే? ఎక్కడికి వస్తుంది?'

ఎక్కడికేమిటే? హైదరాబాద్‌కే వచ్చేస్తోంది. వాళ్లా యనకు యిక్కడకు ట్రాన్స్ఫరయిందిట. ఇరవయ్యో తారీకు కల్లా వాళ్లు హైదరాబాద్‌లో 'ఉంటారట.'

'ఇంకేం ? ఇంక చదువూ సంధ్యామాని పొద్దస్తమానం ఆ మధుమతి యింట్లోనే కూర్చో' అంది తల్లి నవ్వుతూ.

'అమ్మో, నాకు కూర్చోవాలనుకున్నా ఆమెకూర్చోనివ్వ వద్దూ, నాతో కబుర్లు చెప్తూ టైము వేస్టు చేస్తుందా ? ఆ సమయంలో ఒక కథ వ్రాసేసుకుంటే ఎంత మంచిది! లక్షలాది పాఠకులను మెప్పించవచ్చును! నా ఒక్క దాని కోసం అంతమంది ఉత్సాహాన్ని త్యాగం చెయ్య నిస్తానా ?

'ఏమిటే నీపిచ్చివాగుడు. పోయిచదువుకో. త్యాగాలూ పాడూ ఏమిటా మాటలు? ఐనా లక్షణంగా క్లాసు పుస్త కాలు చదువుకోవలసిన రోజుల్లో అడ్డమైన చెత్తా చదివి లేని పోని వ్యాపకాలు కలిపించుకుంటున్నావు' అంది విసుగు నటిస్తూ తల్లి.

'పోవే. నువ్వెప్పుడూ అంతే.' అంటూ మధుమతి హైదరాబాద్ వస్తోందన్న వార్తను చుట్టువక్కల వాళ్ళందరికీ చెప్పటానికి బయటకు పరుగెత్తింది రేఖ.

పంధొమ్మిదవ తారీకుకి యింకా ఐదురోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఆ ఐదురోజులూ రేఖ పొందిన ఆరాటం అంతా యింతా కాదు. ఎప్పుడు పంధొమ్మిదవ తారీకు వస్తుందా ఎప్పుడు మధుమతి హైదరాబాద్‌లో అడుగు పెడుతుందా అని ఒకటే తహతహ. మధుమతి రాకతో హైదరాబాద్ నగరానికే కొత్త అందం వస్తుందని భావించసాగింది రేఖ. అంత గొప్ప రచయిత్రి ఉండే ఊళ్లో ఉండటానికీ తను ఎంత అదృష్టవంతురాలో అనికూడా అనుకుంది.

మధుమతి తనకి దగ్గిర కాబోతుందన్న వార్త తెలిసిన దగ్గరనుండి ఆమె ఎలా ఉంటుందో, ఆమె కుటుంబ జీవితం ఎలా ఉంటుందో అన్న ఆలోచనలు రేఖలో మొదలైనయ్. అంతకుముందు మధుమతిని గురించి రచయిత్రిగా తప్ప స్త్రీగా ఎన్నడూ ఆలోచించలేదు. కాని ఆమె తనకు సన్నిహితురాలు కాబోతుందన్న విషయం తెలిసేక తోటి స్త్రీగా ఆమె తన మీద ఎలాంటి ముద్ర వేస్తుందోనన్న ఆలోచనకూడా రేఖలో తలెత్తింది.

మధుమతి రూపురేకలను గురించి స్పష్టమైన అభిప్రాయాలేవి ఏర్పడక పోయినా ఆమె తప్పకుండా అందగత్తె అయి ఉంటుందన్న నమ్మకం రేఖకుంది. మధుమతిని తలచు

కున్నప్పుడల్లా ఒక తేజోవంతమైన రూపు ఆమె కళ్ళముందు కదిలేది. తెల్లని దుస్తులు ధరించి చిరునవ్వులు చిందించే ఒక అద్భుతమైన సౌందర్యరాశిని ఆమె ఊహించుకునేది.

ఆ తేజోమూర్తిని. ఆ సౌందర్యరాశిని ఎప్పుడు చూద్దామా అని తహతహలాడుతూండగానే పంధొమ్మిదవ తారీకుకూడా గడచిపోయింది. ఇరవయ్యో తారీకు ఉదయం నిద్రలేవగానే రేఖకు వచ్చిన మొదటి ఆలోచన 'నిన్నరాత్రికల్లా మధుమతి హైద్రాబాదు వచ్చి ఉంటుంది' అని.

ఆమె హైద్రాబాదు వచ్చింది. కాని యేం లాభం ఈ క్షణంలో వెళ్ళి ఆమెను చూడలేనుకదా? అబ్బ! పెద్దపెద్ద నగరాల్లో ఉంటే ఎన్ని యిబ్బందులో! ఎవరేమూల ఉన్నది తెలియదుగదా. అదే పల్లెటూరు అయినట్లయితే యీపాటికి పరుగెత్తుకువెళ్ళి మధుమతి యింట్లో వాలేదాన్నికదూ?

అలా పిచ్చి పిచ్చిగా అలోచించుకుంటూండ గానే ఆలామరో నాలుగు రోజులు గడిచి పోయినయ్.

ఐదవ రోజున మధుమతి ఒక కార్డు వ్రాసింది తమ యింటి అడ్రసు తెలియబరుస్తూ ఒక సాయంత్రం వీలుచేసుకుని రమ్మని వ్రాసింది.

'ఎప్పుడో ఎందుకు? ఈ సాయంత్రమే వెళ్తాను' అనుకుంది రేఖ.

మధుమతిని చూడాలన్న ఆనందంలో ఆమెకు కాలేజీకికూడా వెళ్ళ బుద్ధికాలేదు. తప్పనిసరిగా వెళ్ళినా ఆమె మనసు క్లాసులో వింటున్నా పాఠాలమీద ఏమాత్రం లగ్నం కాలేదు.

ఎలాగో నాలుగు గంటలకు కాలేజీనుండి బయటపడ్డాక యింటికి వెళ్ళి సాధ్యమైనంత అందంగా అలంకరించుకుని ఉన్న వాటిలో ఖరీదైన చీరను కట్టుకుని మధుమతి అడ్రెసు చేత బట్టుకుని చిక్కడపల్లి బయలుదేరింది రేఖ.

ఆమె యిచ్చిన నంబరుగల యింటిని కనుక్కోవటానికి అరగంట పట్టింది రేఖకు. 'ప్రఖ్యాత రచయిత్రి మధుమతి యిక్కడకు వచ్చినట్టు ఎవరికీ తెలియదా? ఇంటి నంబరు చెప్పకపోయినా ఆమె పేరు అనగానే ఆమె యిల్లేదో చూపించేవాళ్లు ఒక్కరూ లేరే' అన్న ఆలోచన ఆ అరగంటలోనూ ఆమెను వేధించసాగింది. 'పోనీలే, ఆమె వచ్చి ఐదు రోజులేగా అయింది. కొన్నాళ్ళు పోతేగాని చుట్టుపక్కల వాళ్ళందరికీ తెలియదు' అని సరిపెట్టుకుంది.

తీరా ఆ నంబరుగల యింటిని చూసేక అది మధుమతి యిల్లా కాదా అన్న సందేహం కలిగింది రేఖకు. పాతకాలం నాటి సున్నం వెలిసిపోయిన చిన్న డాబా. ఆ డాబా చుట్టూ మురికి కాలవలు, రోడ్డునిండా చెత్తాచెదారం. ఇలాంటి పరిసరాలలో, యింత పాత యింట్లో - లక్షలాది పాఠకులను

మెప్పించే రచనలను చెయ్యగలిగిన వ్యక్తి ఎలా నివసిస్తుందో తనకి అంతుపట్టలేదు.

ఐనా మధుమతి యిచ్చిన నంబరుగల యిల్లు అదే కనుక తప్పనిసరిగా కొయ్యగేటును తెరుచుకుని మెల్లగా లోపలికి ప్రవేశించింది. ఆ గేటును తెరుస్తున్నప్పుడు దానిని మూసి ఉంచటంకోసం దానికి కట్టిన గుడ్డపీలికలను చూసి మనసు అదోలా అయిపోయింది రేఖకు.

ఒక ఆరేళ్ళపాప బయటకు వచ్చింది. బహుశా యింటి వాళ్ళ పిల్ల అయిఉంటుందనుకుని 'రామ్మూర్తిగారు అద్దెకు ఉంటున్నది యీ యింట్లోనేనా? అని అడిగింది రేఖ.'

'రామ్మూర్తిగారు ఆఫీసునుండి యింకా రాలేదు. మా అమ్మ ఉన్నది యింట్లో. అనడిగింది పాప.

మీ అమ్మ పేరేమిటో ?

మ ధు మ తి.

అదిరిపడింది రేఖ. 'ఏమిటీ ? చీమిడిముక్కుతో, మాసిన బట్టలతో ఉన్న ఈ నల్లని పాప మధుమతి కూతురా?

రేఖ యింకా తేరుకోకముందే పాప లోపలికి పరుగెత్తుకు వెళ్ళి తల్లి చెయ్యి పట్టుకుని వచ్చింది 'అమ్మా ఆంటీ అదుగో! అంటూ.

'మధుమతిగారు...'

'నేనే మధుమతిని, మీ పేరు...'

'రేఖ'

ఓ! రేఖా! రండి. ఆనందంగా ఆహ్వానించింది మధుమతి.

రేఖ అయోమయంగా లోపలికి నడిచింది.

'ఈమె... ఈమె... మధుమతి... ఎలా? అసంభవం' అంటోంది ఆమె మనసు.

'కాదు ఈమె మధుమతే' అని వివేకం నచ్చచెప్తోంది.

ఎంతో అద్భుతమైన సౌందర్యంతో వెలిగిపోతుంది అనుకున్న మధుమతి అంత సామాన్యంగా ఉందేమిటి? పోనీ అందం సంగతటుంచి కనీసం తనూహించుకున్న తేజస్సులో నూరోవంతైనా ఈమెలో లేదే, అబ్బ! ఇల్లు ఎంత పెద్దగా ఉంది! పగుళ్ళుబారిన గోడను, అక్కడక్కడ గుంటలుపడిన పాతకాలంనాటి నాపబండలు పరచిన నేలా... రంగు వెలసిన పోము కుర్చీలు, దండేలకి వేళ్ళాడుతున్న మాసిన బట్టలు...

'అతి కష్టంమీద యీ మాత్రం యిల్లు దొరికింది. అద్దె తొంభై రూపాయలు. రెండే రెండు గదులు. బాత్ రూమ్ కూడా సెపరేట్‌గా లేదు. మాకూ యింటివాళ్ళకి కలిపి ఒకటే... ఐనా ఫరవాలేదు. ఇంటివాళ్ళు మంచివాళ్ళ లాగానే ఉన్నారు. ఈ మాత్రం సౌకర్యంగల యిల్లు దొరకుతుందని మేము అనుకోలేదు...' అంటున్న మధుమతితో

'ఈ యిల్లు నాకు నచ్చింది' అన్న సంతృప్తి తొంగిచూస్తోంది.

'పిల్లలెంత మంది?' ఎలాగో నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అడిగింది రేఖ.

'ఇద్దరు. అదిగో ఆ పాప పెద్దది దానిపేరు సుమతి. తరువాత అబ్బాయి నాలుగేళ్ళవాడు, పేరు రఘు అంది మధుమతి.

రఘు కూడా పాపలాగానే ఉన్నాడు. రెండుముక్కుల నుండి చీమిడికారుతూ పెదవులదాకా వస్తుంటే పైకి గాలిని ఎగబీలుస్తున్నాడు. 'హైద్రాబాద్ వచ్చిన దగ్గరనుండి పిల్లలకు జలుబు చేసింది. నీళ్ళు కొత్తకదా' అంటూ వాడి ముక్కును తన పమిట చెంగుతో తుడిచింది మధుమతి.

'వారింకా ఆఫీసునుండి రాలేదు. వచ్చేవేళైమయింది.' అన్నది బయటకుచూస్తూ.

'ఏ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నారు? ఏం ఉద్యోగం అనడిగింది రేఖ.

'ప్రైవేట్ కంపెనీలో క్లర్కుగా పనిచేస్తున్నారు. నెలకు నాలుగువందల జీతం' అంది మధుమతి.

ఐదు నిమిషాల్లో కాఫీ కలుపుకువచ్చింది మధుమతి.

అదిచూసి పిల్లలిద్దరూ 'అమ్మా నాకు కాఫీ' అంటూ ఎగపడ్డారు.

'ఇప్పుడేగా మీరు త్రాగేరు. ఇంకా ఎన్నిసార్లు తాగుతారు?' అంటూ గద్దించింది మధుమతి.

ఆమె కంఠానికి పాప జంకి, బుంగమూతిపెట్టి అవతలగా నిల్చుంది. కాని రఘు మాత్రం 'కాఫీ కాఫీ' అంటూ మారాం చెయ్యసాగేడు.

'పోనీ ఇవ్వండి కాసిని. రా బాబూ, నేనిస్తాను' అంటూ పిలిచింది రేఖ.

వద్దు. అలా మాటి మాటికీ యిస్తే ఆరోగ్యం చెడిపోతుంది' అన్నది మధుమతి.

'ఆరోగ్యం' అన్నతరువాత యింక రేఖకు కాఫీ యివ్వమన బుద్ధికాలేదు.

మారాంచేస్తున్న బాబును సముదాయిస్తూ, గద్దిస్తూనే రేఖతో కబుర్లు చెప్పసాగింది మధుమతి.

అన్నీ సంసారపు గొడవలే! పాలలో సగానికి సగం నీళ్ళు పోస్తున్నారు. కూరల ధరలు మండిపోతున్నాయట. భర్తకి జీతాన్ని మించిన చాకిరని, పిల్లదానికి ఆమధ్య టైఫాయిట్ వచ్చింది. అప్పుడు ఎన్ని అవస్థలు పడిందీ ఏకరువు పెట్టింది మధుమతి—— బాబు సరే సరి. వాడి ఆరోగ్యం మున్నాట అరవై రోజులూఅంతంత మాత్రంగానే ఉంటుంది.

తనకి కాన్పులమీద వళ్లు బాగా వచ్చేసిందట. ఓపూట అన్నం మానేద్దామా అంటే ఉపవాసం ఉంటే ఇంట్లో చాకిరి

చేసుకునే వోపిక ఉండదట. పైగా యిదిచాలక నడుంనొప్పి ఒకటి. నవ్వారు మంచంమీద పడుకుంటే నడుంనొప్పి ఇంకా ఎక్కువ అవుతుందన్నాడట డాక్టరు. అందువల్ల రోజూ తను నేలమీద చాప వేసుకుని పడుకుంటోందట.

ఇంతలో మధుమతి భర్త ఆఫీసునుండి వచ్చేడు.

'ఈమె రేఖ' అంటూ పరిచయం చేసింది. తన ఉత్తరాలన్నీ చదివే ఉంటాడు. అందుకే తనని ఎరిగినట్లే చూసి పలకరించేడు.

మధుమతిని చూసినప్పుడు ఎంత నిరుత్సాహం కలిగిందో, ఆమె భర్తను చూసేక అంతకు రెట్టింపు నిరుత్సాహం కలిగింది రేఖకు.

మధుమతి భర్త అంటే సినిమా హీరోలా ఉంటాడనీ, గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ కాలుస్తూ ఉంగరాల జుట్టుతో ఖరీదైన వాచీతో—ఏమేమో ఉంటాడని ఊహించుకున్న రేఖకు అతి సామాన్యంగా కాటన్ బట్టలు కట్టుకుని మామూలు వాచీ పెట్టుకుని ఉన్న రామ్మూర్తిని చూసేక ప్రాణం ఉసూరుమనిపించింది. ఇంక మధుమతే నయం అనుకుంది.

చీకటి పడేవరకు ఉండి 'మళ్ళీ ఆదివారం వస్తాను' అని లేచింది రేఖ.

భార్యాభర్తలిద్దరూ ఆమెను గేటువరకు సాగనంపేరు. వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని వెళ్తూ వోసారి వెనక్కి

చూసిన రేఖకు గేటుకున్న గుడ్డపీలికలను, దానిముందు పిల్ల లను పట్టుకుని నిల్చున్న ఆ దంపతులను, తను నడుస్తున్న రోడ్డు కిరువైపులాఉన్న మురికి చెత్త చెదారాన్ని చూస్తుంటే మనసు ముక్కలై పోయింది.

మధుమతిని గురించి తను ఎంతగా ఊహించుకుంది! పెద్ద బంగళా, ఆల్సేషియన్ కుక్కలు, నౌకర్లు వగైరా కాక పోయినా అందమైన చిన్న యిల్లు, ఒక సోపాసెట్టు, యింటి చుట్టూ చిన్న పూలతోటా గల యింట్లో ఆమె ఉంటే బాగుండుననుకుంది. పైగా తానక్కడఉన్న రెండు గంటల లోనూ సంసారాన్ని గురించే మాట్లాడింది తప్ప తన రచనలను గురించి యేమీ మాట్లాడలేదు. ఒక్కసారి మాత్రం 'యీ మధ్య వ్రాయటానికి తీరిక ఉండటం లేదు అన్నది. అంతే! అలాంటి పరిసరాల్లో, ఆ యిరుకు గదిలో అందమైన ఆలోచ నలు ఎలా వస్తాయ్ అనుకుంది.

కాని రేఖలోని ఆ నిరుత్సాహం ఎంతోసేపు ఆమెను కుంగదీయలేదు. 'ఆమె అందంగా లేకపోతేనేం? అందమన్నది భౌతికమే అని ఎందుకనుకోవాలి? ఆమె శరీరంలో లేని సౌంద ర్యం ఆమె మేధస్సులో ఉంది కదా' అనుకుంది.

'రచయిత్రి అయినంతమాత్రాన ధనవంతురాలు కావాలని ఎక్కడ ఉంది? పేదరికం పాపంకాదు, నేరంకాదు. ఖరీదైన యింట్లో లేనంతమాత్రాన ఆమె మనసు పేదది అవుతుందా?' అని సరిపెట్టుకుంది.

ఏమైనా, ఎంతగా సరిపెట్టుకుందామనుకున్నా ఆమెలో ఏమూలో అసంతృప్తి తొంగిచూస్తూనే ఉంది.

తరువాత ఆదివారం వాళ్ళ యింటికి వెళ్ళినప్పుడు బయట ఎండలో బట్టలు ఆరవేసి ఉన్నయ్. ఆ బట్టలలో మధుమతి చీరకూడా ఉంది. ఆమె చీరకు రెండు చిరుగులున్నయ్. ఆ చిరుగులను చూస్తూనే రేఖగుండె ఎందుకో కలుక్కుమంది. తాముకూడా ఏమంత ధనవంతులు కారు. చిరిగిన చీరలను కుట్టుకుని కాలేజీకి కట్టుకువెళ్ళటం తనకేం కొత్తకాదు. కాని తన ఆరాధ్య రచయిత్రి కనీసం యింట్లోనైనా చిరిగిన చీర కట్టుకుందన్న ఆలోచనను ఏమాత్రం సహించలేకపోతోంది రేఖ మనసు.

భర్త కూడా ఆదివారం అవటంవల్ల యింట్లోనే ఉన్నాడు దంపతులిద్దరూ రేఖను సంతోషంగా ఆహ్వానించారు. ఎన్నెన్నో కబుర్లు చెప్పారు. తమకి చాలా దగ్గర బంధువుతో స్నేహితురాలితో మాట్లాడుతున్నట్లున్న వాళ్ళను చూసేక ఆమె మనసులో ముసురుకున్న ఆలోచనా మేఘాలు చాలావరకు చెల్లాచెదరై పోయినయ్.

వాళ్ళ ఆత్మీయత ఆమెను ముగ్ధురాలిని చేసింది.

తను వ్రాస్తున్న నవల తాలూకు కాగితాలను చూపించింది మధుమతి, చిత్తుకాగితాల్లా ఉన్న ఆ పేపర్లను చూసేక మళ్ళీ బాధనిపించింది రేఖకు.

'మీా రచనలమీాద ఆదయం బాగా వస్తుందా ?' అనడిగింది రేఖ.

'ఈ తెలుగుదేశంలో రచనలమీాద ఆదాయం వస్తుందని ఊహించుకోవటంకన్న తెలివితక్కువ మరొకటుండదు. ఏదో రచయిత కళ్ళనీళ్ళు తుడవాలని నామినల్‌గా యిస్తారే తప్ప వాళ్ళిచ్చే పాతికా పరకా ఏ మూలకీ చాలవు' అంది మధుమతి.

'మధుమతి కిప్పుడున్నంత పేరు ప్రతిష్ఠలు గల రచయితగాని, రచయిత్రిగాని ఏ అమెరికాలోనో ఉన్నట్లయితే తన రచనల ద్వారా జీవితానికి సరిపడ్డ డబ్బును సంపాదించవచ్చు' అన్నాడు రామ్మూర్తి.

'కనీసం మధుమతికోసమైనా ఇండియా ఒక్కసారిగా అమెరికా అయిపోతే బాగుండును' అనుకుంది రేఖ. ఆఖరికి సినిమా రంగంలో కూడా నటీ నటులకిచ్చే డబ్బులో పదోవంతు కూడా రచయిత కివ్వరని విన్న రేఖ, తన దేశంలో రచయితలకున్న ఆర్థిక స్తోమతును తలచుకుని మరింత బాధపడిపోయింది.

'మన దేశం దౌర్భాగ్యమే అంత. మేధావంతులైన ఉపాధ్యాయులకు,రచయితలకు, సైంటిస్టులకు తగినంత పోషణే లేదు. నల్లబజారులో వ్యాపారం చేసేవాళ్ళకు, కల్లబొల్లి

కబుర్లు చెప్పే రాజకీయ నాయకులకు యిచ్చేపాటి గౌరవాన్ని కూడా వీళ్ళకివ్వరు' అన్నాడు రామ్మూర్తి.

మరో రోజు మధుమతి యింటికి వెళ్ళేసరికి లోపలి నుండి మధుమతి అరుపులు, పిల్లిఏడ్పు వినపడి గుమ్మంలోనే నిలబడిపోయింది రేఖ.

'ఛీ ! ఛీ ! దరిద్రం ముండ ! ఎన్నిసార్లు చెప్పినా అంతే కదా' అంటూ బడ బడ దెబ్బలు వేయటం, ఆ పిల్ల గట్టిగా ఏడవడం జరిగేసరికి వెంటనే లోపలికి వెళ్ళింది రేఖ.

వంట పనిలోనుండి యివతలకు వచ్చినట్లు మధుమతి ఆకారమే చెప్తోంది.

'అయ్యో ఎందుకలా కొట్టారు ? ఏం చేసింది పాపం?' అనడిగింది రేఖ.

'బయట ఎండలో పప్పులు ఎండపెడితే యిదిపోయి అందులో చెంబెడు నీళ్ళు బోర్లించింది' అంది. మరో అయిదు నిమిషాలదాకా సణుగుతూ, పిల్లవంక ఉరిమిఉరిమి చూస్తూనే ఉంది మధుమతి.

ఆ దృశ్యం రేఖకు చాలా కష్టాన్ని కలిగించింది. పిల్లలను దైవస్వరూపులుగా భావిస్తూ,రచయితలు వారిని ఎంతో ప్రేమగా చూస్తారని, చిన్నతనంకూడా పిల్లలకు తగినంత వ్యక్తిత్వాన్ని ఆపాదించి వాళ్ళను గౌరవిస్తారని ఆమె అభి

ప్రాయం. కాని మామూలు స్త్రీలందరిలాగానే మధుమతి కూడా పిల్లలను చౌకబారు పదాలతో తిడుతుందని, కొడు తుందనీ తెలిసాక ఆమెకు చాలా బాధనిపించింది.

మర్రోజు ఆమె వెళ్ళేసరికి మధుమతి గోడకానుకుని చాపమీద కూర్చొని ఏదో కథ వ్రాస్తోంది. మధ్య మధ్య కాగితాలను లాగబోతున్న రఘునీ వంటింట్లో గిన్నెలు సర్దు తున్న సుమతినీ గట్టిగా కేకలు వేస్తోంది. ఆమె ప్రక్కనే అప్పడాలపిండి, పీట, కర్రా ఉన్నాయ్.

'రండి కూర్చోండి. ఇవ్వాల అప్పడాలు వత్తుదామను కున్నాను. రాత్రి వ్రాయగా మిగిలిన కథ ఉంటే పూర్తిచేసి ఆ తరువాత వత్తవచ్చులే అని వ్రాస్తున్నాను' అంటూ లేచి కాగితాలను పెన్నును గూట్లో పెట్టింది.

అప్పడాల పీటముందు చతికిల పడింది మధుమతి.

అప్పడాలు వత్తుతూ మధ్య మధ్య పిల్లలిని గదమా యిస్తూ రేఖతో మట్లాడింది మధుమతి.

'మిమ్మల్ని మా కాలేజి యూనివర్శిటీనాడు ఆహ్వా నిద్దా మనుకుంటున్నాం. నేను స్టూడెంట్సు యూనియన్ సెక్రటరీని' అంది రేఖ.

'అమ్మో, నేను కాలేజీకి రావటమే ? అంతమంది ముందు మాటాడటమే చేతకాదు నాకు' అంది మధుమతి.

'ఫరవాలేదు. భయపడకండి అందరూ ఆడపిల్లలేగా. మగవాళ్ళెవరూ ఉండరు'.

'ఆడపిల్లలైతేనేం, అందరూ చదువుకున్నవాళ్లు. రేపో మాపో యూనివర్సిటీ డిగ్రీ పుచ్చుకోబోతున్న వాళ్ళు కూడాను'.

'డిగ్రీలిచ్చే విజ్ఞానంకన్న మీకు మీ మేధాశక్తిద్వారా ఆజన్మ సంస్కారంవల్ల చాలా ఎక్కువగానే తెలుసుకున్నారు. మీకు తెలిసినదాన్ని వ్రాతరూపంలో పెట్టినట్లే మాట్లాడండి' అంది రేఖ.

'ప్లీజ్, నన్ను బలవంత పెట్టకండి. నాకసలు స్టేజీ మీద నిలబడటానికే భయం' అంది మధుమతి గాభరా పడుతూ.

ఆ క్షణంలో మొదటిసారిగా మధుమతి అంటే చిన్న చూపు కలిగింది రేఖకు. తాను ఎంతో ఉన్నతంగా ఊహించుకున్న మధుమతి తనలాంటి అమ్మాయిలముందు మామూలు పాఠకులముందు భయపడుతోందంటే ఏమనుకోవాలి ?

కాని వెంటనే రేఖ మరోరకంగాకూడా ఆలోచించింది. పదిమందిముందూ వేదికమీద నిలబడి మాట్లాడలేనంతమాత్రాన ఒక వ్యక్తిలో గొప్పతనం లేదని ఎలా అనుకోవటం ? ఆ మాటకివస్తే స్టేజీమీద నిలబడి మాటాడేవాళ్ళంతా గొప్పవాళ్ళేనన్న ఋజువేమిటి ? ఒక్కొక్క మనిషిలోని గొప్పతనం

ఒక్కో రూపంలో వ్యక్తమవుతుంది. కొందరు గొప్పగా మాట్లాడతారు. కొందరు గొప్పగా వ్రాస్తారు. మరికొందరు యీ రెండూ చేతకాకపోయినా గొప్పపనులుచేసి తమ గొప్పతనాన్ని ప్రదర్శిస్తారు.

అందరిలోనూ అన్నిరకాల గొప్పతనం ఉండాలని ఆశించటం తెలివితక్కువ అని సరిపెట్టుకుంది రేఖ.

ఏది యేమైనా నాలుగు నెలలు మధుమతితో స్నేహం చేసి ఆమె జీవితాన్ని పరిశీలించిన తరువాత రేఖకు చాలా ఆశాభంగం కలిగింది.

ఎంతో అందంగా ఉంటుందనుకున్న రచయిత్రి అతి సామాన్యంగా ఉండటం, అందాల రాజకుమారుడిని పెళ్ళాడి ఉంటుందనుకున్న ఆమె మామూలు గుమాస్తాను పెళ్ళాడటం. పిల్లలను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దు తుందనుకున్న ఆమె మామూలు స్త్రీలా వాళ్ళమీద విసుక్కోవటం, చల్లగాలిలో వెన్నెల రాత్రివేళో లేక సంధ్యాసమయానో తీయని ఊహలలో తేలిపోయే క్షణాలిలో రచనలు చేస్తుందనుకున్న రచయిత్రి అప్పడాలూ వత్తుతూ, పిల్లవాడి చీమిడిముక్కును పమిటిచెంగుతో తుడుస్తూ మధ్యమధ్య తైము చిక్కినప్పుడల్లా కథలు వ్రాస్తుందనీ, ఎక్కడో నరవాసనలేని ఒక ప్రశాంత ప్రదేశంలో కుటీరంలాంటి యింట్లో, నివశిస్తుందనుకున్న రచయిత్రి మురికి కాలవలమధ్య చెత్తాచెదారంగల రోడ్డుప్రక్కన

ఉండే ఒక పాతయింట్లో ఉండటం, ఎప్పుడూ ఎవరు వెళ్ళినా సాహిత్యాన్ని గురించి, కళలను గురించి మాటాడుతుందని, విజ్ఞానదాయకమైన చర్చలతోనే కడుపు నింపుకుంటుందనీ ఊహించుకున్న ఆమె కేవలం కూరగాయల ధరలను గురించి పాలలోని నీళ్ళను గురించి సీరియస్‌గా మాటాడటం, అన్నీ రేఖకు ఆశ్చర్యంతోపాటు బాధనుకూడా కలిగించినయ్.

మధుమతి దగ్గర తగినంత చనువు ఏర్పడటంవల్ల తను ఆమెను గురించి ఎలా ఊహించుకున్నదీ, ఆ ఊహలు ఎలా తలక్రిందులయిందీ తనకి దానివల్ల ఎంత ఆశాభంగం కలిగిందీ అన్నీ చెప్పింది రేఖ.

విని నవ్వింది మధుమతి. 'ఇంద్రధనుస్సు ఎందుకంత అందంగా ఉంటుందో తెలుసా? అది మెరిసేది ఆకాశంలో కనుక, అంతేకాదు. అన్ని రంగులున్నా సామాన్యపరిస్థితులలో తెల్లగానే కనబడే కాంతి కిరణంలా ఎన్ని విశిష్ట లక్షణాలున్న వ్యక్తులైనా నిత్యజీవితంలో అతిసామాన్యంగా ఉండకతప్పదు రేఖా! రచయిత్రిగా నా మేధస్సు ఎలాంటిదైనా వ్యక్తిగా నా జీవితం అతిసామాన్యమైనది. నా రచనలలో నాలోని రచయిత్రిని మాత్రమే చూడగలిగేవు. ఇప్పుడు నాలోని స్త్రీని చూస్తున్నావు. అందుకే నీకింత బాధగా ఉంది' అన్నది.

ఆమె మాటలు వింటుంటే ఆమెను కేంద్రంగా తీసుకుని అల్లుకున్న కలల తాలూకు రంగులన్నీ ఒక్కొక్కటిగా కరిగిపోతున్నట్లు అనుభూతి కలిగింది రేఖకు.